కలెక్టర్‌ను సన్మానించిన 'గడ్డిఅన్నారం' చైర్మన్



కలెక్టర్‌కు పండ్ల బుట్టను అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను మంగళవారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించి, పండ్ల బుట్టను అందజేశారు. నూతన మార్కెట్ కోసం ప్రభుత్వం కోహెడ గ్రామంలోని సర్వే నంబర్ 507/2, 548/2లో 178.09 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. మార్కెట్ నిర్మాణం కోసం మొదటి ఫేజ్ పనులకు డీపీఆర్ సిద్ధంగా ఉన్నదని దానికి సంబంధించిన ఫైల్ సీఎం దగ్గర ఉన్నదని వివరించారు. మార్కెట్ నిర్మాణానికి సంపూర్ణంగా సహకరిస్తామని కలెక్టర్ తెలిపినట్లు ఆయన తెలిపారు.

ట్రాన్స్‌జెండర్స్ ఆధార్ కార్డుల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ జెండర్స్ కోసం నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ కార్డుల క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు మేనేజర్ జయంతి సూచించారు. మంగళవారం మలక్‌పేట వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఆధార్‌కార్డుల జారీక్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌జెండర్స్ కోసం మూడురోజుల పాటు ఈ క్యాంపు జరుగుతుందని కొత్త కార్డులతో పాటు కార్డులో మార్పులుచేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు ఆధార్‌లో ట్రాన్స్‌జెండర్స్ కాలం లేదని ఇప్పుడు కొత్తగా ఆ కాలం పెట్టడం జరిగిందన్నారు. త్వరలో ట్రాన్స్‌జెండర్స్‌కూ అన్ని జిల్లాల్లో ప్రత్యేక క్లినిక్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అరుణ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్ స్వప్నారెడ్డి

ప్రణాళికాబద్ధంగా భూగర్భ డ్రైనేజీ నిర్మాణం

సరూర్‌నగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తున్నామని మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి తెలిపారు. 30, 31, 32 డివిజన్లకు సంబంధించి చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ భీమిడి స్వప్నాజంగారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బి.జంగారెడ్డి, కాలనీల ప్రతినిధులు కొండా శ్రవణ్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సరోజ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై చిన్నారులకు అవగాహన

కొత్తపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. మంగళవారం నాగోల్ సాయినగర్ రాక్‌వుడ్స్ స్కూల్ నుండి 47 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్స్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లెక్చర్ హాల్‌లో పిల్లల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన వీడియో క్లిప్స్‌ను ప్రదర్శిస్తూ నిబంధనలపై అవగాహన కల్పించారు. పార్కు ప్రహరీపై ఉన్న ట్రాఫిక్ నిబంధనలు, సూచనల పోస్టర్లు, రోడ్ సైన్స్ చూపుతూ టీటీఐ అధికారులు, హీరో మోటోకార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ నిబంధనల ప్రాధాన్యతను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్, స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

చీకట్లో 'థీమ్'!

లక్ష్మీనగర్ కాలనీ పార్కులో ఆహ్లాదం దూరం

- లైటింగ్ లేక సాయంత్రం 6 గంటలకే మూత
- నిర్వహణలో నిర్లక్ష్యం ● పట్టించుకోని ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు



లక్ష్మీనగర్ థీమ్ పార్కు

కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన లక్ష్మీనగర్ థీమ్ పార్కు ప్రజలకు ఆహ్లాదం అందించడం లేదు. లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయకుండానే 10 నెలల క్రితం ఆర్భాటంగా ప్రారంభించి, నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో రాత్రి 9 గంటల వరకు ఆహ్లాదం పంచాల్సిన పార్కును సాయంత్రం 6 గంటలకే మూసేస్తున్నారు. ఎమ్మెల్యే కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైదాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో 2,500 గజాలకు పైగా స్థలంలో థీమ్‌పార్కును సుమారు రూ.2కోట్లతో అభివృద్ధి చేశారు. ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ఈ సంవత్సరం జనవరిలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. విదేశాల నుంచి సామగ్రిని తెప్పించి పార్కులో ఏర్పాటు చేశారు. కానీ కొద్దిరోజులు బాగానే ఉన్నా.. తర్వాత నిర్వహణను జీహెచ్ఎంసీ అధికారులు గాలికి వదిలేశారు. కనీసం పార్కులో లైటింగ్ సిస్టం లేకపోవడంతో 10నెలలుగా థీమ్ ఆహ్లాదం ప్రజల చెంతకు చేరడం లేదు. పార్కు వేళలు ఉదయం 5గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 9 వరకు ఉండాలి. కానీ లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో సాయంత్రం 6 గంటలకే పార్కును మూసివేస్తున్నారు. దీంతో రాత్రివేళలలో లైటింగ్‌లేక థీమ్‌పార్కుకు ప్రజలు, మహిళలు, చిన్నారులు రాలేకపోతున్నారు.

వాకింగ్ ట్రాక్‌లు.. ప్లే ఏరియా ఇలా..

విశాలంగా ఏర్పాటు చేసిన లక్ష్మీనగర్ థీమ్ పార్కులో మహిళలు పిల్లలు, పెద్దలు సేదతీరేలా ఏర్పాట్లు చేశారు. 50 రకాల ఔషధ మొక్కలతో కూడిన పచ్చదనంతోపాటు వాకింగ్‌ట్రాక్, ప్లే ఏరియా, యోగా సెంటర్ సిద్ధం చేశారు. కిట్టీ పార్టీల కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు. చెప్పులు షూస్ లేకుండా నడిస్తే మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యానికి ఉపకరిస్తుందనే ఉద్దేశంతో కంకరరాళ్లు, నల్లరేగడి, మట్టి, నీరు, ఇసుకరేణువులు, గులకరాళ్ల పోసి దారులను వేశారు. హృదయాకారం, పడవ ఆకారంలో ఉండే సెల్ఫీస్పాట్‌ను కూడా పార్కులో సిద్ధం చేశారు.



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్లే ఏరియా

లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి



అధునాతన సౌకర్యాలతో థీమ్ పార్కును అభివృద్ధి చేసి లైటింగ్ సిస్టం వేయకపోవడం దారుణం. అధికారులకు పలుమార్లు కలిసి విన్నవించినా స్పందనలేదు. స్పష్టత కూడా ఇవ్వడం లేదు. వీలైనంత తొందరలో లైటింగ్‌సిస్టం ఏర్పాటు చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తేవాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, కాలనీ సంక్షేమ సంఘం, లక్ష్మీనగర్ కాలనీ

పాట్నా టీటీఎఫ్‌లో ఆకట్టుకుంటున్న బుద్ధవనం స్టాల్

తెలంగాణ పర్యాటక స్టాల్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్



బుద్ధవనం ప్రాజెక్టు స్టాల్‌ను ప్రారంభించిన గజేంద్రసింగ్ షెకావత్. చిత్రంలో పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో జరుగుతున్న ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్(టీటీఎఫ్)లో తెలంగాణ పర్యాటక సంస్థ ఏర్పాటు చేసిన నాగార్జునసాగర్ బుద్ధవనం ప్రాజెక్ట్ పలువురిని విశేషంగా ఆకట్టుకుంటోంది. బిహార్ రాజధాని పాట్నాలో స్మార్ట్ కాంప్లెక్స్, జ్ఞానభవన్‌లో తెలంగాణ టూరిజం-బుద్ధవనం స్టాల్‌ను మంగళవారం కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రారంభించారు. పాట్నా టీటీఎఫ్‌లో బుద్ధవనం, బౌద్ధవారసత్వ థీమ్‌పార్కుతోపాటు యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లాలోని పాలంపేట్‌లోని రామప్ప దేవాలయం, హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ప్రపంచ వారసత్వ స్మారక చిహ్నాలను ఈ సందర్భంగా గజేంద్రసింగ్ షెకావత్ సందర్శించారు. ఆయా పర్యాటక కేంద్రాల చారిత్రాత్మక ప్రాశస్త్యాన్ని తెలుసుకుని త్వరలో తెలంగాణకు రానున్నట్టు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గమ్యస్థానంగా అభివృద్ధి చేసే విషయాలపై సమగ్రంగా చర్చించేందుకు ఢిల్లీలోని తన కార్యాలయానికి రావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా బౌద్ధచరిత్రకారుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలంగాణలోని పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను విశ్లేషించారు. కార్యక్రమంలో పర్యాటక సంస్థ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

'దానా' ప్రభావంతో 41రైళ్లు రద్దు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'దానా' తుఫాన్ ప్రభావంతో తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలోని వివిధ మార్గాల్లో మొత్తం 41 రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం ఒక ప్రటకలో పేర్కొన్నారు. ఒడిశా తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 23 నుంచి 27 వరకూ పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

దీపావళి, ఛత్‌కు 804 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా 804 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా నవంబర్ 30 వరకు దాదాపు 6,556 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

కాచిగూడ-తిరుపతి స్పెషల్ రైలు రద్దు

బర్కత్‌పుర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసిన కాచిగూడ-తిరుపతి స్పెషల్ రైలు(07063)కు ప్రయాణికుల ఆదరణ లేకపోవడం వల్ల రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ప్రయాణికులు ఎవరూ టికెట్ బుక్ చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

పెద్దఅంబర్‌పేట్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా

- శానిటేషన్‌పై ప్రత్యేక ఫోకస్
- మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు తెలిపారు. అధికారుల, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మంగళవారం ఆమె పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ అభివృద్ధిపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.



మున్సిపల్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు..?

పెద్దఅంబర్‌పేట్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో నిధులు రాబట్టి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం. ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

మున్సిపాలిటీ పరిధిలో అక్రమనిర్మాణాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించం. ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా తప్పనిసరిగా అనుమతులు తీసుకుకోవాల్సిందే. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకునేలా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులకు సూచించాం.

డంపింగ్ యార్డు సమస్య ఎలా పరిష్కరిస్తారు?

కొంతకాలంగా డంపింగ్ యార్డు సమస్య ఉన్నమాట వాస్తవమే. ప్రస్తుతం మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను జీహెచ్ఎంసీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ కూడా సమస్య వచ్చింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే డంపింగ్ యార్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

మున్సిపాలిటీలో మరో 4 గ్రామాలు విలీనం అయ్యాయి కదా.. ఆర్థిక భారాన్ని ఎలా అధిగమిస్తారు..?

నాలుగు గ్రామాలు ఉన్న మున్సిపల్‌లో మరో నాలుగు గ్రామాలు కలువడంతో కొంత భారం పెరిగిన మాట వాస్తవమే. పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఇంటి అనుమతుల ద్వారా వచ్చే ఆదాయంతో అన్ని గ్రామాల్లో సమానంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. కొత్త గ్రామాల్లో కూడా పన్నుల ద్వారా నిధులను సమకూర్చుకుంటాం.

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై మీ కామెంట్?

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని శానిటేషన్ అధికారులకు సూచించాం. చెత్తకుప్పలకు ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా ఆదేశాలిచ్చాం. శానిటేషన్‌పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడం. శానిటేషన్‌పై ప్రతి వార్డులో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి.ఆశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకం ద్వారా కులవృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, చెప్పులు కుట్టువారు, మేస్త్రీ, బుట్టలు, చాపలు, చీపుర్ల తయారీదారులు, కొబ్బరిపీచులల్లేవారు, బొమ్మల తయారీదారులు, మంగళి, పూలమాలలు అల్లేవారు, రజకులు, టైలర్, మత్స్యకారులు, వలలు తయారుచేసేవారు అర్హులన్నారు. చేతులు, పనిముట్లతో పనిచేస్తూ, కుటుంబ సంప్రదాయ వృత్తుల్లో నిమగ్నమైన హస్తకళాకారులు, వృత్తికళాకారులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి దరఖాస్తుదారుడి వయసు కనీసం 18 ఏళ్లు ఉండాలని, గత ఐదేళ్లలో స్వయంఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రుణం పొందకుండా ఉండాలన్నారు.

రూ.56లక్షలతో ఆజంపురలో సీసీ రోడ్ల నిర్మాణం : ఎమ్మెల్యే

చాదర్‌ఘాట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్ల పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం ప్రారంభించారు. ఆజంపురలోని దావూద్ మియా మజీద్‌లేన్‌లో, చంచల్‌గూడ న్యూరోడ్‌లో నూతన సీసీరోడ్లను నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. వీటి కోసం రూ.56లక్షల నిధులను వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆజంపుర డివిజన్‌లోని స్థానికుల వినతి మేరకు అవసరమైన అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

అనంతరరం ఆజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో గల జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో 50 మంది మహిళలకు ఎమ్మెల్యే బలాల కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్‌పార్టీ మలక్‌పేట ఇన్‌చార్జి నజీమా, ఎంఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కాలనీలో రూ.10 లక్షలతో యూజీడీ పనులు



పనులకు శంకుస్థాపన చేస్తున్న జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 8వ వార్డులో రూ.10 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు మంగళవారం చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజల సహకారంతో అభివృద్ధిలో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సిద్ధంకి కృష్ణారెడ్డి, రాజేందర్, డీఈఈ శివానదం, వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో సవతి తండ్రికి జీవిత ఖైదు

రూ.30 వేల జరిమానా.. బాలికకు రూ.12లక్షల పరిహారం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడైన సవతి తండ్రికి జీవిత ఖైదుతోపాటు రూ.30 వేల జరిమానాను రంగారెడ్డి జిల్లా స్పెషల్ సెషన్స్‌కోర్టు విధించింది. బాధితురాలికి రూ.12 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివరాలు ఇలా ఉన్నాయి..ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ వ్యక్తి(44) కొంతకాలంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ బాలిక చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి మరో వ్యక్తిని పెళ్లిచేసుకుంది. కొన్నాళ్లకు తల్లి కూడా చనిపోవడంతో సవతి తండ్రి బాలికపై కన్నేశాడు. గత ఏడాది బాలిక చదువుతున్న స్కూల్ వద్దకు వెళ్లి టీసీ ఇవ్వాలని హెడ్మాస్టర్‌ను కోరాడు. ఆ విషయాన్ని స్కూల్ ఉపాధ్యాయుడు బాలికకు తెలిపాడు. దాంతో ఆ బాలిక తన తండ్రి మంచివాడు కాదని, గతేడాది దసరా సెలవులని చెప్పి కవాడిపల్లిలోని కిరాయి ఇంటికి తీసుకెళ్లి తనపై పలుమార్లు అత్యాచారం చేసినట్లు తెలిపింది. బాలికతో కలిసి ఉపాధ్యాయుడు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా స్పెషల్ సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి హరీష నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధితులరాలికి రూ.12 లక్షలను పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

గుండెపోటుతో మధ్యాహ్న భోజన కార్మికురాలు మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు మారగోని ఉమ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విజయవాడ జాతీయరహదారిపై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శివకుమార్, రమాదేవి, నిర్మలమ్మ, నవనీత, లక్ష్మమ్మ, రాములమ్మ, రంగమ్మ, రాజమణి, స్వరూప పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు లబ్ధి : ఎమ్మెల్యే

చంపాపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని హస్తినాపురం నార్త్‌కు చెందిన చెందిన నిర్విక(6) గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతోంది. వారిఆర్థిక పరిస్థితులు బాగలేక నిర్విక తండ్రి సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఆపరేషన్ కోసం మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీని మంగళవారం అతడికి ఎమ్మెల్యే అందజేశారు.

ఎల్లమ్మ ఆలయానికి ఎలక్ట్రిక్ డోల్ వితరణ

చంపాపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీహనుమాన్ దేవస్థానం పాలకమండలి మాజీ ధర్మకర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బసిగుడెం జంగారెడ్డి కుమారుడు సోమనాథ్ రెడ్డి మంగళవారం రావిరాలలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయంకు రూ.51వేల విలువైన ఆటోమెటిక్ ఎలక్ట్రిక్ డోల్‌ను ఈఓ మోహన్‌రావుకు వితరణగా అందజేశారు. బసిగూడెం సోమనాథ్‌రెడ్డిని ఈఓ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కాశి, నిఖిల్, సాయిరాం, బసిగూడెం సోమనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్

కొత్తపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యూ నాగోల్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ తెలిపారు. రూ 42.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ ఏఈ మాతృనాయక్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోచంపల్లి రాజేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిని కలిసిన ఆర్యవైశ్యులు

చంపాపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణను మంగళవారం ఆయా నియోజకవర్గాలకు చెందిన ఆర్యవైశ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధానకార్యదర్శిగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కర్మన్‌ఘాట్‌కు చెందిన బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తాను నియమించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా గందె సురేష్‌గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు, మరో రెండు రోజుల్లో సమావేశం నిర్వహించి మిగతా కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా తాజా మాజీ అధ్యక్షుడు తాడెపల్లి వెంకటేశం, మాజీ అధ్యక్షుడు అర్థం లక్ష్మయ్య, తాజా మాజీ కోశాధికారి బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, నూతన అధ్యక్షుడు గందె సురేష్‌గుప్తా, చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, జగన్‌గుప్తా, చంద్రశేఖర్, వేణుగోపాల్‌రావు, విజయ్‌నాథ్, ఊరే మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, లోకేష్ గుప్తా పాల్గొన్నారు.

'ఉద్యోగులు జీతభత్యాన్ని స్వయంగా తీసుకునే వసతి కల్పించాలి'



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ఎల్బీనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు జీతభత్యాన్ని స్వయంగా తీసుకునే వసతి కల్పించాలని మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం ఎన్‌టీఆర్‌నగర్‌లోని రాష్ట్ర యూనియన్ భవనంలో జరిగింది. ఈ సమావేశంలో సెంట్రల్ ఫోరం కార్యదర్శి ఎండీ ముఖ్రం, సహ అధ్యక్షుడు వెంకటేశం, కోశాధికారి చంద్రశేఖర్, సెంట్రల్ యూనియన్ ఈసీ సభ్యులు సంతోష్, రాజేశ్వరి, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సెంట్రల్ ఫోరం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సుభాష్‌రెడ్డికి నివాళి

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బద్దం సుభాష్‌రెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీవీనగర్ బస్‌స్టాప్ వద్ద, పీఅండ్‌టీ కాలనీలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు ఆనంద్‌కుమార్, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివరామ్, రాజేశ్వరి, ఉమర్, రూప్‌లాల్, శ్రీనివాస్‌చారి, రత్నం, బాబుచౌదరి, సంతోష్‌కుమార్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనులు నాణ్యతతో చేపట్టాలి

వనస్థలిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో జరుగుతున్న వరద నీటి కాలువ పనులు నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో చేపడుతున్న వరదనీటి కాలువపనులను మంగళవారం కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, జలమండలి మేనేజర్ రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను పెంచాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి



నిరసన కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి, తదితరులు

వనస్థలిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే పెంచాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీఎన్‌రెడ్డినగర్‌లో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ పెరిగిన ధరల ప్రకారం 16 లక్షల మంది కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.5,500 నుంచి రూ.20 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న కళాశాల విద్యార్థుల రూ.4వేల కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు పెంచుతున్న ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను పెంచరా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ప్రైవేట్ యూనివర్సిటీల్లో కూడా అమలు చేయాలన్నారు. ఈ ఏడాదిలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 129 బీసీ గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని, కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, గురుకుల సీట్లను పెంచాలని, నిరుద్యోగులకు అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరికే మల్లేష్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, కిషోర్‌యాదవ్, అనిల్ కుమార్, భాను గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక

వనస్థలిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నవంబర్ 17న తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వధూవరుల 16వ పరిచయవేదికను నిర్వహిస్తున్నామని బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చింతపల్లి మంగపతిరావు, అధ్యక్షులు పోచంపల్లి శ్రీధర్‌రావు, ప్రధానకార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు వారు వనస్థలిపురంలో మంగళవారం మాట్లాడుతూ వనస్థలిపురం గురుద్వార్ రోడ్డులోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో ఉదయం 8 గంటల నుంచి పరిచయ వేదిక ప్రారంభమవుతుందని అన్నారు. వివరాలకు 6302454218 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన



నారమోని జగన్ (ఫైల్)

వనస్థలిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మంగళవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు.. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతలపల్లి మండలం గడియగౌరారం గ్రామానికి చెందిన నారమోని జగన్(27) భార్య, కూతురుతో కలిసి కొంతకాలంగా బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాగర్‌కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గుర్రంగూడ సమీపంలోని విపాసన ధాన్యకేంద్రం సమీపంలోని నిర్మాణంలో ఉన్న హైరైజ్ అపార్ట్‌మెంట్స్‌లో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే జగన్‌మృతి చెందాడు. సదరు అపార్ట్‌మెంట్‌వాసులు విషయాన్ని మృతుని కుటుంబానికి తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాధితులు అపార్ట్‌మెంట్ యాజమాన్యం ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడంతోనే జగన్ మృతిచెందాడని ఆరోపించారు. అపార్ట్‌మెంట్ ముందు మృతదేహంతో ఆందోళన చేశారు. మృతదేహన్ని పెట్రోల్‌తో కాల్చేందుకు సదరు యాజమాన్యం ప్రయత్నించారని ఆరోపించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించారు.